# మమతల తీరం

డా. శ్రీనివాస దీక్షితులు

ఉదయం ఎనిమిది గంటలయింది.

మేడమీద ఆ చిన్నగదిలో మాత్రం ఇంకా తెల్లారలేదు. బాధ్యతారాహిత్యానికి గుర్తులా వుంది ఆ గది. ఖాళీ చేసిన విస్కీ బాటిల్స్. కాలిపోయిన జీవితాల్లా సిగరెట్ పీకలూ, నలిగిపోయిన పేకముక్కలూ నేలంతా చిందరవందరగా పడివున్నాయి.

''బారెడు పొద్దెక్కింది! లేచి మొహం కడుక్కొస్తే కాఫీ ఇస్తా'' కసువు చిమ్ముతూ కటువుగా అంది విజయ.

భర్త వులుకూ పలుకూ లేకుండా నిద్రపోతుంటే విజయకి కోపం మరింత పెరిగింది.

''ఏవండీ! నా మాటలేమైనా మీ చెవుల్లో దూరుతున్నాయా? ఇంటి విషయాలు కొంచెమైనా పట్టించుకోరేంటీ? రాత్రింబగళ్ళూ జల్సాలూ, సరదాలేనా?'' అంటూ చిమ్మిన కసువంతా పేపర్లోకి ఎత్తేసింది విజయ.

''ఛీ! ఛీ! వెధవ సంత! రోజూ పొద్దున్నే నాతో పోట్లాడితేకాని నీకు గడవదా? అయినా నాకు తెలియక అడుగుతాను, నాతో పోట్లాడటం తప్పా నీకు వేరేం పనిలేదా? ఇక చాల్లే! బంగారంలాంటి నా నిద్ర పాడు చెయ్యకుండా పోపో!'' కళ్ళు మూసుకునే కసురుకున్నాడు రాంబాబు.

''నిద్రా.. నిద్రా! ఎప్పుడూ నిద్రేనా?'' ఎద్దేవాగా అంది విజయ.

''పొద్దున్నే లేచి నేనేం చెయ్యాలిటా? ఊళ్ళేలాలా? ఉద్యోగాలు చెయ్యాలా? ఇంటి వ్యవహారాలన్నీ ఆ ముసలావిడే చూసుకుంటోందిగా? ఇంకా నాతో ఏంపనీ?'' కసిగా అనేసి దుప్పటి మొహం మీదికి లాక్కుని గోడవైపుకి తిరిగి పడుకున్నాడు రాంబాబు.

''ఆమాటే వద్దంటున్నా. ఎన్నాళ్ళని ఆవిడ చేస్తుంది? మిమ్మల్ని కని అపురూపంగా పెంచినందుకు.. ఆమెకిది శిక్షా? హరిబాబు కూడా ఈమధ్య విసుక్కుంటున్నాడు. వాడు మాత్రం ఎన్నాళ్ళు భరిస్తాడు? ఇరవయ్యేళ్ళ వయసులో అరవయ్యేళ్ళ బాధ్యతలు మోస్తున్నాడు. మీరేమో రోజు రోజుకీ చిన్నపిల్లలైపోతున్నారు'' గట్టిగానే అంది విజయ.

భార్య మాటలకి తోకతొక్కిన తాచల్లే రాంబాబు మంచం మీద లేచి కూర్చున్నాడు. ''ఏంటే! ఇందాకట్నుంచీ చూస్తున్నా. సూక్తులు వల్లిస్తున్నావ్. పో! కిందికి దిగిపో!'' గయ్‌మని అరిచి పడుకున్నాడు రాంబాబు. విజయ మారుమాట్లాడకుండా కిందకి దిగి వచ్చేసింది.

రోజు మొత్తం మీద ఆ భార్యాభర్తలిద్దరూ మాట్లాడుకునేది ఆ పదినిముషాలే.

కింద పంచలో కూర్చుని ప్లాస్టిక్ వైర్‌తో బుట్ట అల్లుతున్న అనసూయమ్మగారికి మేడమీద కొడుకు వేస్తున్న కేకలు స్పష్టంగా వినిపిస్తూనే వున్నాయి.

రోజూ కొడుకు కేకలు వినటం మామూలే అయినా ఈరోజెందుకో ఆరుపదులు దాటిన ఆమె గుండెనిండా బాధాజలపాతాల హోరు వినిపిస్తోంది. స్వయానా మేనకోడలైన విజయకి తెలిసీ తెలిసీ తీరని అన్యాయం చేశానేమో? ఆమె బ్రతుకు బుగ్గిపాలు చేశానేమో? అన్న బాధ మనసు పొరల్ని తూట్లు తూట్లుగా చేస్తోంది.

చేతివేళ్ళు మాత్రం అప్రయత్నంగా బుట్టని అల్లుతూనే వున్నా అంతరంగంలో మాత్రం ఆపలేని గతస్మృతి తరంగాలు పరవళ్ళు తొక్కుతున్నాయి.

తన భర్త రామచంద్రయ్యగారు వూళ్ళో పెద్దమనిషి. తన పెళ్ళయ్యేనాటికి వున్న ఎకరం భూమిని కష్టపడి సేద్యం చేసి మూడేళ్ళలో మూడెకరాలు చేశాడు. పాతకాలంనాటి పెంకుటింటిని పడగొట్టి మూడు గదుల డాబా యిల్లుగా మార్చాడు. దిగులు లేకుండా జీవితం గడిచిపోతోంది.

తనకి పెళ్ళయిన నాలుగేళ్ళకి పెద్దమ్మాయి కస్తూరి పుట్టింది. తర్వాత వరసగా యేడాది తేడాతో రమ, రాంబాబు పుట్టారు. నవ్వుల నావలా సాగుతున్న తన జీవితం ఒక్కసారిగా విషాదం సుడిగాలిలో చిక్కుకుంది.

ఆరోజు అర్ధరాత్రి.. ఆయన మంచం మీద అటూయిటూ దొర్లుతున్నారు. ఆ అలికిడికి నాకు మెలకువ వచ్చింది. ఆయన నాకేదో చెప్పాలనుకుంటున్నారు. కాని.. చెప్పలేకపోతున్నారు. ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. గుండె పట్టుకుని బాధపడుతున్నారు. నాకేం చేయాలో తోచడంలేదు. ఏడుస్తున్నాను. నాకంతా అయోమయంగా వుంది. అంతలోనే ఆయన చేతితో సైగలు చేసి చెప్పారు.. తనకి గుండె నొప్పి వచ్చిందని.

వెంటనే డాక్టరుగారికోసం కబురు పంపాను. మంచి నీళ్ళు తెచ్చిచ్చాను. ఒక్కచుక్క కూడా తాగలేకపోయారు. డాక్టరుగారు వచ్చేలోపలే జరగకూడనిదంతా జరిగిపోయింది.

కర్మకాండ అంతా యధావిధిగా జరిగిపోయింది. ఏవో సానుభూతి వాక్యాలు చెప్పి బంధువులంతా ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

దుఃఖాన్ని దిగమింగి, గుండె దిటవు చేసుకుని ధైర్యంగా కాలంతోపాటు ముందుకు అడుగులు వేసింది. పిల్లల్ని పెంచి పెద్ద చేసింది. శక్తిమేరకి చదివించింది.

ఇద్దరాడపిల్లలకీ మంచి భర్తలే దొరికారు. కొడుకులూ, కోడళ్ళతో హాయిగా వున్నారు. రాంబాబు జగమొండిగా తయారయ్యాడు. స్కూలుకెళ్ళేవాడు కాదు. చదివేవాడు కాదు. టెన్త్ ఎలాగో పూర్తిచేశాడు. ఇంటర్ చదువుతూ మధ్యలో మానేశాడు. చెడు స్నేహాలు, చెడ్డ అలవాట్లూ వయసుతోపాటు పెరిగాయి. పెళ్ళి చేస్తే బాధ్యత తెలిసొస్తుందని, మంచిదారిన పడతాడు అని నలుగురూ అంటుంటే తన తమ్ముడి కూతురు విజయతో రాంబాబు పెళ్ళి జరిపించింది.

విజయకి చదువూ, అందం, అణకువా అన్నీ వున్నాయి. ఏ కోణంలోంచి చూసినా తన కొడుకు ఆమె ముందు దిగదుడుపే.

''నాయనమ్మా! నేను ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యాను'' నేలమీద పాకుతూ వచ్చి పాదాలు తాకి కళ్ళకద్దుకుంటున్న రాఘవ మాటలు విని అనసూయమ్మగారు గతంలోంచి వర్తమానంలోకొచ్చారు.

అల్లుతున్న వైరుబుట్ట పక్కనపెట్టి వంగి ప్రేమతో మనవడి తల నిమిరింది. బొడ్లో దోపుకున్న చీరకొంగు ముడి విప్పి ఇరవై రూపాయలు తీసి రాఘవ చేతిలోపెట్టి ''రాఘవా! అన్నయ్యచేత స్వీట్స్ తెప్పించుకుని నీ స్నేహితులందరికీ పంచిపెట్టుకో. వెళ్ళు!'' అంది.

ఆ సమయంలో ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాడికి ఫస్ట్‌క్లాస్ వచ్చిందని ఆనందం ఒకవైపు, పోలియో వ్యాధితో చచ్చుపడిపోయిన వాడి రెండు కాళ్ళు రేపిన విషాదం మరోవైపు. అందుకే అనసూయమ్మగారి కళ్ళల్లో ఆనంద భాష్పాలూ, విషాదాశ్రువులూ రెండూ వున్నాయి చీకటి వెలుగుల్లా. రాఘవ చిన్నప్పటి నుంచీ చదువులో చురుకే. ఆత్మస్థైర్యం కోసం మెడిటేషన్ అలవాటు చేసుకున్నాడు. టెన్త్ వరకూ అన్న హరిబాబే సైకిల్ మీద తీసుకెళ్ళి స్కూల్లో దింపి వచ్చేవాడు.

ఇంటర్‌లో వొక స్వచ్ఛంద సేవా సంస్థవాళ్ళు రాఘవకి ఒక చక్రాల బండిని ఉచితంగా పంపిణీ చేశారు. దాంతో అతనికి మరోవ్యక్తి ఆసరా అవసరం లేకపోయింది. ఇంటర్‌లో, డిగ్రీలో స్కాలర్‌షిప్ వచ్చింది. అందువల్ల అతని చదువు వాళ్ళ కుటుంబానికి భారం కాలేదు.

''అమ్మా! చూశావా నాన్న ఏం చేశాడో? నువ్వూ, నాయనమ్మా కష్టపడి తయారుచేసిన అప్పడాలు, వడియాలు, విస్తళ్ళు, పచ్చళ్ళు, కారప్పొడి అన్నీ మనం సరఫరా చేస్తున్న కొట్టు యజమాని దగ్గరికెళ్ళి, కల్లబొల్లి కబుర్లు చెప్పి మనకి రావలసిన డబ్బంతా తీసేసుకున్నాడట.''

వంటింట్లో వున్న తల్లి దగ్గరికి వెళ్ళి మొరపెట్టుకున్నాడు హరిబాబు.

''ఎప్పుడు?'' తల్లి అడిగింది ఆదుర్దాగా.

''నిన్న రాత్రి'' కోపంగా చెప్పాడు హరి.

''మరి... నాయనమ్మ అల్లిన వైర్ బుట్టల డబ్బు?''

''ఆ డబ్బు మొన్ననే స్వాహా చేశాట్ట'' హరి బాధగా చెప్పాడు.

''మనమంతా కలిసి రాత్రింబగళ్ళూ కష్టపడి సంపాదించిందంతా ఆయనగారు తాగుడికీ, సిగరెట్లకీ ఇలా తగలేస్తే మనం బతికేదెట్లారా? నామాటంటే ఆయనకి లెక్కలేదు. వెళ్ళి మీనాయనమ్మకి చెప్పు'' అని పెద్దకొడుకుని అత్తగారి దగ్గరికి పంపించింది విజయ.

హరిబాబు పదవతరగతి ఫెయిల్ అయిన దగ్గర్నుంచీ యింటిదగ్గరే వుంటున్నాడు. అనసూయమ్మగారి పర్యవేక్షణలో కుటుంబ వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నాడు. తీరిక వేళల్లో రేడియోలూ, టి.వీ.లూ రిపేర్ చేస్తూ కొంత డబ్బు సంపాయిస్తున్నాడు. నాయనమ్మ దగ్గరికొచ్చి హరిబాబు తండ్రి చేసిన ఘనకార్యం గురించి చెప్పాడు.

''నాకు విసుగు పుడుతోంది నాయనమ్మా! నేనిక నాన్నతో వేగలేను. ఆయన చేస్తున్న పనులకి బజార్లో తలెత్తుకుని తిరగలేకపోతున్నా. నిన్నూ, అమ్మనీ, అవిటి తమ్ముణ్ణీ చూసి ఇంటిపనులన్నీ చేస్తున్నానే కానీ నాన్న మొహం చూసి మాత్రం కాదు'' అని ఆవేశంగా, ఆవేదనగా అన్నాడు హరిబాబు.

''ఒరేయ్ హరీ! యింకెప్పుడూ తమ్ముణ్ణి అవిటివాడంటే వూరుకోను. ఈమాట వాడు వింటే ఎంత బాధపడతాడు?'' అని హరిబాబుని మెత్తగా మందలించింది అనసూయమ్మగారు.

''సారీ! నాయనమ్మా! ఏదో ఆవేశంలో అన్నాను'' అని చెప్పి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు హరి.

మనవణ్ణి వోదార్చి పంపింది అనసూయమ్మగారు. కాని హరిబాబు అంతరంగం ఆమె అనుభవానికి అందలేదు. మనుషులు మూడు రకాలుగా వుంటారు. బాధ్యతల్ని చూసి భయపడి దూరంగా పారిపోయి తప్పించుకు తిరిగేవారు మొదటిరకం. బాధ్యతల్ని మోస్తూ మోస్తూ మధ్యలో భయపడి వాటిని వదిలేసి పారిపోయేవారు రెండవరకం. ఇక బాధ్యతల్ని ధైర్యంగా స్వీకరించి సాహసంతో పూర్తిగా నెరవేర్చేవారే మూడవరకం. వీరినే చరిత్ర గుర్తిస్తుంది.

హరిబాబు రెండవరకం.

అతను యింట్లోంచి వెళ్ళిపోయి నెలరోజులు దాటుతోంది. ఎక్కడికి వెళ్ళాడో... ఎందుకు వెళ్ళాడో.. ఏం చేస్తున్నాడో తెలియదు. అతను వెళ్ళిననాటి నుంచి దిగులుతో అనసూయమ్మగారు మంచం పట్టింది. చిక్కి శల్యమయింది. డాక్టర్లు ఎన్ని మందులిచ్చినా రోగం మాత్రం తగ్గటంలేదు. చివరికి ఆమెకి జబ్బేమీ లేదని.. మనోవ్యాధితో బాధపడుతోందని తేల్చి చెప్పారు.

ఇంటి పనులూ, బయటిపనులూ, అత్తగారి సేవలూ అన్నీ పాపం విజయ ఒక్కతే వోపిగ్గా చేసుకుంటోంది. ఆమెకిప్పుడు కొత్త సమస్య వచ్చిపడింది. అదే ఆర్థిక సమస్య. అత్తగారి మందులు కొనటానికి చేతిలో పైసా లేదు. ఏం చేయాలో తోచక వంటరిగా వంటింట్లో కూర్చుని ఏడుస్తోంది విజయ. అప్పుడే యింట్లోకి వచ్చిన రాఘవ తల్లి పరిస్థితిని అర్థంచేసుకున్నాడు. మెల్లగా పాక్కుంటూ తల్లిదగ్గరికి చేరాడు.

''నీకు నేనున్నానమ్మా! ఇంతకాలం ఎంతో ధైర్యంగా మమ్మల్ని పెంచిన నువ్వే ఇప్పుడు భయపడుతున్నావా? నువ్వే అధైర్యపడితే నాకు ధైర్యం చెప్పేవాళ్ళెవరమ్మా! నాయనమ్మనీ, నిన్నూ చూసి నేనెన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నా'' అంటూ చేత్తో కన్నీళ్ళు తుడిచాడు రాఘవ.




''రాఘవా! నీ ఎస్.టి.డి. బూత్‌కోసం బ్యాంక్‌లోన్ అడిగావుగా. ఆ విషయం ఏమయిందిరా?''

''ఆ విషయం చెబుదామనే వచ్చానమ్మా! ఈరోజే బ్యాంక్ లోన్ శాంక్షన్ అయిందమ్మా. ఫ్రెండ్స్ అందరూ కలిసి బూత్‌క్కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎల్లుండే ప్రారంభోత్సవం. నువ్వూ, నాయనమ్మా తప్పక రావాలి'' చెప్పాడు రాఘవ.

''ఈ పరిస్థితిలో నాయనమ్మ ఎలావస్తుందిరా?'' దిగులుగా అడిగింది విజయ. రాఘవ ఏమీ మాట్లాడలేదు.

''సరే ఏమైతే అయింది. ఈ విషయం ముందు నాయనమ్మకి చెప్పిరారా'' సలహా ఇచ్చింది విజయ.

అనసూయమ్మగారి దగ్గరికి వెళ్ళి రాఘవ మెల్లగా శుభవార్త అందించాడు.

ఆమాట వింటూనే అనసూయమ్మగారు మంచం మీద లేచి కూర్చున్నారు. ఆ క్షణంలో వొక్కసారిగా ఆమె అనారోగ్యమంతా తగ్గిపోయినట్లనిపించింది. ఉల్లాసంగా బూత్ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంది. తాను దగ్గరుండీ స్వయంగా ప్రారంభోత్సవం జరిపిస్తానంది.

అనుకున్నరోజు రానే వచ్చింది. ముహూర్తం వేళకి ముందుగానే అనసూయమ్మగారు కోడలుతో కలిసి రిక్షాలో రాఘవ ఎస్.టి.డి. బూత్ దగ్గరికి చేరుకుంది. రిక్షా దిగుతూనే అనసూయమ్మగారు ఆశ్చర్యపోయింది. ఎదురుగా చిన్నప్పటి నుంచీ చిన్నపని కూడా చేయని తన కొడుకు రాంబాబు కనిపించాడు. ఫంక్షన్‌కి వచ్చిన వాళ్ళని సాదరంగా ఆహ్వానిస్తూ హడావుడిగా అటూయిటూ తిరుగుతున్నాడు. ఆమె తన కళ్ళని తానే నమ్మలేకపోతోంది. అందుకే తన పక్కనున్న కోడలికి కూడా ఆ దృశ్యాన్ని చూపించింది అనసూయమ్మగారు.

అంతలో రాఘవ వారిద్దరూ నిలబడ్డచోటుకి వచ్చాడు. ''నాయనమ్మా! నాన్న మారిపోయాడు. నాకు కొండంత ధైర్యం వచ్చింది. ఈ సమయంలో అన్నయ్య కూడా వుంటే ఎంతో బాగుండేది!'' అన్నాడు.

అప్పుడతని కళ్ళల్లో ఆనంద భాష్పాలు నిలిచాయి. తర్వాత బ్యాంక్ మేనేజర్‌గారు వచ్చి రిబ్బన్ కట్‌చేసి బూత్‌ని ప్రారంభించారు. రాఘవ మొట్టమొదటి కాల్ అనసూయమ్మగారి చేత చేయించాడు. బూత్ బయటికొచ్చి అనసూయమ్మగారు తమ జీవితాన్ని మలుపుతిప్పిన మనవడివంక చూస్తూ తృప్తిగా వూపిరి పీల్చుకుంది. జీవన మలి సంధ్యలోకి చేరుకుంటున్న ఆమె చూపుల్లో మళ్ళీ రెక్కలు తొడుగుతున్న ఆశ కనిపించింది.

★